సాక్షి
కుమురం భీం
శనివారం, 29, మార్చి, 2025



గ్రామాల్లో సౌర వెలుగులు..!
ఉమ్మడి జిల్లా రెండు గ్రామాలు పీఎం సూర్య ఘర్ మస్త్ బిజిలీ యోజనకు ఎంపిక య్యాయి. ఆయా గ్రామాల్లో సోలార్ వెలుగు లు విరజిమ్మనున్నాయి. 10లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:25	ఆది : 4:56

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.1 /24.6
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఉంటుంది.

అడవి తల్లి ఆసరా



అడవిలో ఇప్పపూలు సేకరిస్తున్న ఆదివాసీలు

కెరమెరి మండలం చిన్నసాకడ గ్రామానికి చెందిన ఈ మహిళ పేరు దుర్వ సార్జాబాయి. ఏటా గ్రామ సమీపంలోని అడవికి బుట్టలతో వెళ్లి ఇప్పపూలు సేకరిస్తుంది. ఇలా నెల రోజుల వ్యవధిలో 50 కిలోల ఇప్పపూలు సేకరించి.. రూ.1500 వరకు సంపాదిస్తుంది. ఉదయం గంట పాటు అడవికి వెళ్తే అదనపు ఆదాయం వస్తుందని, ఆ డబ్బుతో ఇంట్లో నిత్యావసరాలు తెచ్చుకుంటానని సార్జాబాయి చెబుతోంది.

- జిల్లాలో ఇప్పపూలు, జీడి గింజల సేకరణ షురూ
- గిరిజన ప్రాంతాల్లో సందడి వాతావరణం
- ఉపాధి మార్గం చూపుతున్న అటవీ ఉత్పత్తులు
- వచ్చే నెల 1 నుంచి జీసీసీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభం

కెరమెరి(ఆసిఫాబాద్): అడవి తల్లిని నమ్ముకుని గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. సీజన్ల వారీగా దొరికే పూలు, పండ్లను అమ్ముకుని ఆదాయం సమకూర్చుకుంటున్నారు. వ్యవసాయ పనులు లేని వేసవి కాలంలో అటవీ ఉత్పత్తులే వారికి జీవనాధారంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం వేసవి ప్రారంభమైన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఇప్పపూలు, జీడి గింజల సేకరణ మొదలైంది. మరోవైపు గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఏర్పాట్లు చేస్తోంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కెరమెరి, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, వాంకిడి, తిర్యాణి, జన్నారం, దండేపల్లి, బోథ్, ఇచ్చోడ, బేలా, బజార్‌హత్నూర్, బెజ్జూర్, సిర్పూర్(టి) తదితర మండలాల్లో గిరిజన అధికంగా జనాభా ఉంది. ప్రస్తుతం గిరిజనులు తెల్లవారు జామునే పిల్లలతోపాటే అడవి బాట పడుతున్నారు. ఇప్పపూలు, జీడిపండ్లతోపాటు తునికి పండ్లు, మొర్రిపండ్లు, సారపలుకులు సేకరిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలంతా ఆదివాసీలు వీటి సేకరణలో నిమగ్నమై ఉంటారు. ముఖ్యంగా కెరమెరి మండలంలో అడవులు అధికంగా ఉన్నాయి. సాకడ, సాంగ్వి, కొప్పగూడ, పిట్టగూడ, కెలి కె, లెండిగూడ, మెట్టపిప్రి, మోడి, చాల్‌బడి, జోడేఘాట్, పాట్నాపూర్‌లో ప్రజలకు అటవీ ఉత్పత్తులే ఆధారంగా నిలుస్తున్నాయి.

1 నుంచి కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి జీసీసీ ఆధ్వర్యంలో ఇప్పపూలు, జీడిగింజలు, తేనె కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలోని 25 డీఆర్ డిపోల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై ప్రచారం ప్రారంభించారు. గతేడాది అనివార్య కారణాలతో కొనుగోలు ప్రక్రియ చేపట్టలేదు. కానీ ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పపూలు 500 క్వింటాళ్లు, తేనె 500 క్వింటాళ్లు, జీడీగింజలు 50 క్వింటాళ్లు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు.

గిరిజనులకు ఆదాయం..



గిరిజనులు సేకరించిన జీడిపండ్లు

ఇప్పపూలు, తునికాకు, ఇతర పండ్ల సేకరణ గిరిజనులకు ఆదాయం తెచ్చిపెడుతోంది. ఇప్పపూలు పోషక విలువలు కలిగిన ఆహారం కావడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గర్భిణులకు లడ్డూలు తయారు చేసి అందిస్తున్నారు. గ్రామీణులు కూడా కొంతమంది జీసీసీకి అమ్ముకుంటుండగా, మరికొందరు నిల్వ చేసుకుని వంటల్లో వినియోగిస్తున్నారు. ఇక జీడీ పండును జాగ్రత్తగా చెట్టు నుంచి తెంపుతుంటారు. గింజ నుంచి వేరు చేసిన పండును ఆరబెట్టి తింటారు. తాజా పండును మాత్రం నిప్పుల్లో కాల్చుకుని ఆరగిస్తారు. నల్లటి గింజను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. గతంలో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో వీటికి డిమాండ్ లేదు. జీసీసీ ఆధ్వర్యంలో గతంలో ఇప్పపూలకు కిలోకు రూ.20 చెల్లించారు. ఈ ఏడాది ఇప్పపూలు కిలోకు రూ.30, జీడి గింజలు రూ.12కు కొనుగోలు చేయనున్నారు.

ధరలు పెంచాలి



ఇప్పపూలు, జీడి గింజలకు జీసీసీ చెల్లించే ధర తక్కువగా ఉండటంతో గిట్టుబాటు కావడం లేదు. కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నాం. అధికారులు స్పందించి ధరలు పెంచాలి. ఆదివాసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.
– కోవ ఇందిర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆదివాసీ మహిళా సంఘం

1 నుంచి కొనుగోళ్లు

జీసీసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాం. డీఆర్ డిపోలకు తీసుకువచ్చేందుకు ఇబ్బందులు ఎదురైతే ఇంటింటికీ వెళ్లి కొనుగోలు చేస్తాం. పూర్తి సరుకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాం. ఎవరూ ఆందోళన చెందవద్దు.
– తారాచంద్, జీసీసీ మేనేజర్

న్యూస్‌రీల్

మైనార్టీలు యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మైనార్టీ వర్గాలకు(ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ) చెందిన నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించొద్దని పేర్కొన్నారు. ముస్లింలు బీసీ–ఈ, క్రైస్తవులు బీసీ– సీ, బాప్టిస్ట్ సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు. వ్యవసాయేతర పథకాలకు 21నుంచి 25 ఏళ్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు 21 నుంచి 60 ఏళ్లు ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు https://tgobmmsnew.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువపత్రాలు జతపర్చి ఎంపీడీవో కార్యాలయాల్లోని మండల ప్రజాపాలన సేవా కేంద్రం, మున్సిపల్, జోనల్ కమిషనర్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సమర్పించాలని తెలిపారు.

2న 'బీసీల పోరుగర్జన'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రిజర్వేషన్ల అమలుకు ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీల పోరుగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో శుక్రవారం పోరుగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లహుకుమార్, వైరాగడే మారుతిపటేల్, నాగోసె శంకర్, ఎనయ్య, రాజుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ



ట్రైసైకిళ్లు ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భారత్ డైనమిక్ లిమిటెడ్ ద్వారా దివ్యాంగులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా దివ్యాంగులకు పింఛన్ పెంచడంలో విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): భూసమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమార్కులు విచ్చలవిడిగా పట్టాలు పొందుతున్నారని ఆరోపించారు. పార్ద గ్రామంలో ఓ గిరిజనేతరుడు అక్రమంగా బై నంబర్లతో పట్టాలు పొందాడని పేర్కొన్నారు. సుర్దాపూర్ గ్రామంలో కూడా జంగుబాయి దేవతల ప్రతిమలు ఉన్న భూములను కబ్జా చేసి పట్టాలు పొందారని ఆరోపించారు. ఎస్‌డీసీకి దరఖాస్తు చేసి తొమ్మిది నెలలవుతున్నా పరిష్కారం కాలేదన్నారు. అక్రమ పట్టాలను రద్దు చేయకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం డీటీ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు ఆత్రం రాజు, సిడాం ధర్మూ, చహకటి రాంకిషన్, తలండి జంగు, బాలకిషన్, పెందోర్ వినేష్, వల్కె బాదు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వకు జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పంటల కోత అనంతరం ధాన్యం నిల్వ చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర గిడ్డంగుల సంస్థ(సీడబ్ల్యూసీ) ఆదిలాబాద్ మేనేజర్ వరికుంట రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ధాన్యం నిల్వలో ఎలుకలు, ఉడతలు, లక్కపురుగులు, పలు క్రిమికీటకాలను నివారించే పద్ధతులు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం రైతులను స్థానిక ఎస్‌డబ్ల్యూసీ గోదాం వద్దకు తీసుకెళ్లి నిల్వ పద్ధతుల గురించి వివరించారు. రైతులకు కిలో చొప్పున ఎరువు, క్వింటాల్ సామర్థ్యం గల లోహపు డబ్బాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి మిలింద్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ విజయేందర్‌రెడ్డి, ఏఈవోలు చిరంజీవి, రాము, దమ్ముదాస్, సూపరింటెండెంట్ గౌతమ్, సిబ్బంది సాయి, ఫణీంద్ర, టెక్నికల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న హైర్‌బస్ డ్రైవర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: అక్రమాలకు పాల్పడుతున్న ఆదిలాబాద్ ఆర్‌ఎంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హైర్‌బస్ డ్రైవర్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ల నియమించుకుంటున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందుకోసం ఆసిఫాబాద్ డిపో నుంచి సుమారు 250 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో ప్రైవేట్ హైర్‌బస్సు డ్రైవర్లు కూడా ఉండగా, వీరికి ఎలాంటి సమాచారం లేకుండానే ఆర్‌ఎం, పీవో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కమిషన్లు, పైరవీలకు పెద్దపీట వేస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా కొంతమందిని రిక్రూట్ చేసున్నారని మండిపడ్డారు. ఆ నియామకాలను రద్దు చేసి పీహెచ్‌బీ డ్రైవర్లను ఎలాంటి షరతులు లేకుండా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 4లోపు సమస్య పరిష్కరించుకుంటే 5 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని డీఎంకు వినతిపత్రం అందించారు. డిపో అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి షఫీక్, బాలేశ్, భాస్కర్, తిరుపతి, శోభన్, విజయ్‌కుమార్, సాయి, గణేశ్, ఇమామ్, హైమద్, నవీన్, భీంరావ్, గోపాల్, అంజి పాల్గొన్నారు.

నేడు జాబితా ప్రదర్శన

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో 52 పోస్టులకు సంబంధించిన ప్రివిజనల్ లిస్టు తాత్కాలిక జాబితాను జిల్లా కలెక్టర్ ఆసిఫాబాద్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ వైద్య కళాశాల వెబ్‌సైట్లతోపాటు నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితా శనివారం ఉదయం 10 గంటల నుంచి ఏప్రిల్ 3 మధ్యాహ్నం 3 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అభ్యంతరాలు ఉంటే వచ్చే నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను జిల్లా నియామక కమిటీ పరిశీలించిన అనంతరం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదు'

తిర్యాణి(ఆసిఫాబాద్): అవగాహన లేకుండా ఆదివాసీ కొలాం సమాజంపై సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడడం సరికాదని కొలాం సంఘం నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆత్రం బొజ్జిరావు, టేకం భగవంత్‌రావు, ఆత్రం భీంరావు, పుసం రాజు, గంగారాం, రాజు, భీము తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ బక్కి వెంకటయ్య, పక్కన సభ్యులు, అధికారులు



ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- కలెక్టరేట్‌లో అధికారులతో పలు అంశాలపై సమీక్ష

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, ప్రవీణ్, నీలాదేవి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్‌తో కలిసి ఆర్‌వోఆర్ పట్టాలు, అట్రాసిటీ కేసులు, భూసమస్యలు, ఎస్సీ, ఎస్టీలకు కల్పించే ప్రయోజనాలపై జిల్లా అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. అట్రాసిటీ కేసులు, బాధితులకు అందిన పరిహారం, ఎస్సీ, ఎస్టీలకు జరిగిన భూపంపిణీ, వివాదాలు, పోడు భూముల పరిష్కారం, గురుకులాలు, వసతి గృహాల్లో సౌకర్యాలు, ఉద్యోగులకు కల్పిస్తున్న పదోన్నతులు, రోస్టర్ విధానంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసులు, ఎస్సీ, ఎస్టీల సమస్యలు ఈ నెల 31లోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించాలని సూచించారు. పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు నిబంధనల ప్రకారం ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు అందించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని ఆదేశించారు. ప్రతినెలా చివరి రోజు గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అంబేడ్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ గురుకులాలు, వసతిగృహాలను పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయి అధికారులను నియమిస్తామని తెలిపారు. అంతకు ముందుకు కలెక్టరేట్‌కు వచ్చిన కమిషన్ చైర్మన్, సభ్యులకు ఘనంగా స్వాగతం పలికారు, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేగుంట కేశవ్‌రావు, గోపాల్, గణేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ నెట్‌వర్క్(బీఎస్‌ఎన్‌ఎల్)టవర్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో సుశాంత్, బీఎస్‌ఎన్‌ఎల్ నిజామాబాద్ సర్కిల్ జీఎం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జీఎం జగ్రామ్‌తో కలిసి టవర్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన తొమ్మిది టవర్లలో ఎనిమిదింటికి ఎలాంటి ఆటంకాలు లేనందున అనుమతులు పొంది నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కెరమెరి మండలం పరందోళిలో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో అదనంగా మరో 16 టవర్లు మంజూరయ్యాయని, అనువైన స్థలాలు ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు కిరణ్, దత్తు, ప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, బీఎస్‌ఎన్‌ఎల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

విచారణ వేగంగా పూర్తి చేయాలి



ప్రశంసాపత్రం ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: పోక్సో/గ్రేవ్ కేసుల్లో విచారణ వేగంగా పూర్తిచేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పారదర్శకంగా చేపట్టాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జ్‌షీట్ వరకు పరిశోధించి తుదినిర్ణయం తీసుకోవాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలు, డయల్ 100 సేవల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాద వ్యవహరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం రవాణా, పశువుల రవాణా వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణతో ప్రతిభ చూపిన ఆసిఫాబాద్ సీఐ రవీందర్, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, వాంకిడి ఎస్సై ప్రశాంత్‌తోపాటు పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, రమేశ్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి యువరాజా, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: నూతన చట్టాలపై పోలీసు అధికారులకు అవగాహన అవసరమని డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రెటరీ యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి నేరాలు, సైబర్ మోసాలకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు సత్వర పరిహారం వచ్చేలా చూడాలన్నారు. లోక్‌అదాలత్ ద్వారా చాలావరకు కేసు పరిష్కారం కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు కేసులు, శిక్షలు, ఇతర విషయాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి యువరాజను ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు శాలువాతో సన్మానించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, రమేశ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోత లేకుండా శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్‌: కిడ్నీ స్టోన్‌తో బాధపడు తున్న వృద్ధురాలు (80)కి ఎలాంటి కోతలు లేకుండా అత్యాధునిక టెక్నాలజీతో విజయ వంతంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ తెలిపారు. జైనథ్‌ మం డల కేంద్రానికి చెందిన పింటుబాయి అనే 80ఏళ్ల వృద్ధురాలు రిమ్స్‌ యూరాలజీ విభా గంలో మంగళవారం అడ్మిట్‌ అయ్యారు. డాక్టర్‌ కార్తీక్‌ ఆధ్వర్యంలో అనెస్థీషియా వైద్యు రాలు హిమనీ రోగి శరీరంపై ఎలాంటి కోత లు లేకుండా లేజర్‌ టెక్నాలజీ ఉపయోగించి స్టోన్స్‌ను తొలగించినట్లు పేర్కొన్నారు. దీంతో పలువురు వైద్యులు, సిబ్బంది, సూప రింటెండెంట్‌ పర్యవేక్షకుడు డాక్టర్‌ సత్యనా రాయణను అభినందించారు. అలాగే వైద్య రోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యులను అభినందించారు.

యోగా పోటీల రిఫరీగా వినోద్‌

జన్నారం: జాతీయస్థాయి యోగా రిఫరీ, జడ్జ్‌ మా పోటీలో పరీక్ష రాసి, ఉత్తీర్ణత సాధించి యోగా రిఫరీగా జన్నారం మండలం మహ్మ దాబాద్‌కు చెందిన దుర్గం వినోద్‌ ఎంపిక య్యారు. ఈనెల 23న నిర్వహించిన ఆన్‌లైన్‌ యోగా పరీక్ష రాసి ప్రతిభ కనబరిచినట్లు తెలంగాణ యోగా అసోసియేషన్‌ కార్యదర్శి సిద్ధారెడ్డి, మాజీ కార్యదర్శి మనోహర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ప్రెసిడెంట్‌ అశోక్‌ అగర్వాల్‌ చేతుల ఉత్తీర్ణత పత్రం అందుకున్నాడు.

సెలవు దినాల్లోనూ సేవా కేంద్రాలు

ఆదిలాబాద్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్‌ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30, 31న వినియోగదారుల సేవా కేం ద్రాలను తెరిచి ఉంచనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్‌ నిజామాబాద్‌ అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజులు అయినప్పటికీ వినియోగదా రులు బిల్లులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశా న్ని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని ఆదిలా బాద్‌, కొమురం భీమ్‌ ఆసిఫాబాద్‌, మంచిర్యా ల, నిర్మల్‌ జిల్లా వినియోగదారులు వినియో గించుకోవాలని కోరారు.

పశువుల వాహనం పట్టివేత

పెంబి/కడెం: అక్రమంగా పశువులను తర లిస్తున్న బొలెరో వాహనాన్ని, పశువులను స్వాధీనం చేసుకున్నట్లు పెంబి/కడెం ఎస్సై కొమురయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్‌ మండ లంలోని మల్కెడి గ్రామం నుంచి హస్నాపూర్‌ కు పశువులను తరలిస్తున్నారనే సమాచారం తో ఎల్కపల్లి పెట్రోల్‌ బంక్‌ వద్ద ఉదయం 5 గంటలకు తనిఖీలు నిర్వహించాం. బొలెరో వాహనంలో తరలిస్తున్న 5 ఎద్దులు, రెండు దున్నపోతులను స్వాధీనం చేసుకున్నామ న్నారు. కరీంనగర్‌కు చెందిన జాఫర్‌, మహ్మద్‌ రఫీ, కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి తాగిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్‌: గంజాయి తాగిన వ్యక్తిని అరెస్ట్‌ చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపా రు. ఆదిలాబాద్‌ పట్టణంలోని సిటాన గర్‌కు చెందిన బాయసాహెబ్‌ అనే వ్యక్తి గం జాయికి అలవాటు పడినట్లు పేర్కొన్నారు. మావల పోలీసుస్టేషన్‌ పరిధిలో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో గంజాయి తాగి ఉండగా.. బాంజానగర్‌ ప్రాంతంలో పట్టు కొని తనిఖీ చేయగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. అతని వద్ద 4 గ్రాముల గం జాయి లభ్యమైనట్లు వివరించారు.

గ్రామాల్లో సౌర వెలుగులు..!

- ‘పీఎం సూర్యఘర్‌ మఫ్త్‌ బిజిలీ యోజన’కింద ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో రెండు మోడల్‌ గ్రామాలు
- పూర్తయిన సర్వే



వెంకట్రావుపేటలో సర్వే చేస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: గ్రామీణ ప్రాంత ప్రజలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ అందించడం లక్ష్యంగా సోలార్‌ విద్యుత్‌ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమం త్రి ‘సూర్యఘర్‌ మఫ్త్‌ బిజిలీ యోజన’ పథకం కింద సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణ యించింది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో ఒక గ్రామాన్ని మోడల్‌ తీర్చిదిద్దనున్నారు. దీంతో ఆ గ్రామాల్లో సోలార్‌ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌ మండలం నర్సాపూర్‌, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్‌ మండలం వెంకట్రావ్‌ పేటను మోడల్‌ గ్రామాలుగా ఎంపిక చేశారు. కాగా ఆ గ్రామాల్లో ఎన్‌పీడీసీఎల్‌ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేశారు. ఎన్ని ఇండ్లు, విద్యుత్‌ సర్వీస్‌ మీటర్లు, వ్యవసాయ కనె క్షన్లు, తదితర వివరాలపై సర్వే చేపట్టారు. ఈ వివ రాలను ప్రభుత్వానికి నివేదించి, తదుపరి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ చెబుతున్నారు.

సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా..

కేంద్ర ప్రభుత్వం, పునరుత్పాదక ఇంధన మం త్రిత్వ శాఖ ద్వారా, రాష్ట్రంలో రెడ్‌కో విద్యుత్‌ పం పిణీ సంస్థలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రతీ జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సంపూర్ణ సౌర విద్యుత్‌ గ్రామంగా తీర్చిదిద్దనున్నారు. సౌర శక్తి గ్రామంగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం రూ. కోటి సాయం అందిస్తుంది. స్థానిక ఉత్పత్తి

ఎంపిక చేసిన గ్రామాల వివరాలు..				
గ్రామం	విద్యుత్‌ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్‌	వ్యవసాయ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్‌
వెంకట్రావుపేట	1415	1405	346	340
నర్సాపూర్‌	131	128	76	75

చేయడం విద్యుత్‌ ఖర్చులు తగ్గనున్నాయి.

ఇంటి యజమానికి అవకాశం..

రూఫ్‌ లెవల్‌ బిల్డింగ్‌పై కిలోవాట్‌ సోలార్‌ ఏర్పా టుకు 80 నుంచి 90 స్క్వేర్‌ ఫీట్లు, 2 కిలోవాట్‌ సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు 160 నుంచి 190 స్క్వేర్‌ ఫీట్లు, 3 కిలోవాట్స్‌ సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు 270 స్క్వేర్‌ ఫీట్ల స్థలం అవసరం ఉంటుంది. వ్యవ సాయ బోరుబావుల వద్ద 7.5 కిలోవాట్స్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు బోరుబావుల నుంచి 100 మీటర్ల దీయ షన్‌ పరిధిలో సరైన ప్రదేశం అవసరం ఉంటుంది. 2 కిలోవాట్స్‌ ప్లాంటు ఏర్పాటు అయితే ఇంటి యజమానికి నెలకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల ఆదాయం వరకు, బోరు బావుల వద్ద 7.5 కిలోవాట్స్‌ ప్లాంటుకు రూ. 5 వేల నుంచి రూ 6 వేల వరకు ఆదాయం యజమానికి చేరుతుంది. దీంతో పాటు రైతు గృహ అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో రెండు గ్రామాలు..

సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, సమా జం తమ ఇంధన అవసరాలకు తీర్చుకోవడం లో స్వావలంబన పొందేలా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మోడల్‌ సోలార్‌ విలేజ్‌ అనే పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం అమ లుకు రాష్ట్రంలోని 17 జిల్లాలలో 8 గ్రామాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్‌ జిల్లాలో ఉట్నూర్‌ డివిజన్‌ పరిధిలో నర్సాపూర్‌, మంచిర్యాల జిల్లా పరిధిలో లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట్‌ గ్రామాలను ఎంపిక చేశారు. నర్సాపూర్‌లో 131 విద్యుత్‌ మీటర్లకు 128ఇండ్లను అర్హతగా గుర్తిం చారు. వ్యవసాయ బోర్లు 75 నమోదు పూర్తి చేశారు. వెంకట్రావుపేటలో 1415 విద్యుత్‌ మీటర్లకు 1405, 346 వ్యవసాయ బోరుబావుల కనెక్షన్లకు 340 నమోదు చేశారు. మొత్తం 1746 కనెక్షన్లు నమోదు చేశారు. ఇంటి యజమాని పేరు, బ్యాంకు ఖాతా నెంబర్‌, ఆధార్‌ నెంబర్‌, రూఫ్‌ లెవల్‌లో ఉన్న స్థలం వివరాలను సేకరిం చారు. ఎంత సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ ఏర్పాటు చేయాలో వివరాలు సేకరించారు. ఆ వివరాలను సూర్యఘర్‌ పోర్టల్‌లో నమోదు చేశారు.

సర్వే పూర్తి చేశాం..



ప్రధాన మంత్రి సూర్యఘర్‌ మఫ్త్‌ బిజిలీ యోజన పథకం ద్వారా సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయిం చింది. మోడల్‌ గ్రామాల్లో సోలార్‌ విద్యుత్‌ ప్లాం ట్లను ఏర్పాటు చేసేందుకు సర్వే చేశాం. ఏడీఈ, ఏఈ, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటి వివ రాలు, యజమాని పేరు, ఆధార్‌కార్డు వివరాలు సేకరించారు. రైతులకు సోలార్‌ ప్లాంట్‌ ప్రయో జనాలను వివరించాం.

– గంగాధర్‌, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, మంచిర్యాల

‘కడెం’ను సందర్శించిన డ్యాం సేఫ్టీ బృందం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డ్యాం సేఫ్టీ బృందం

కడెం: కడెం ప్రాజెక్టును శుక్రవారం ‘స్టేట్‌ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్‌’ బృందం సభ్యులు రిటైర్డ్‌ సీఈ, ఇరిగేషన్‌ మెకానికల్‌ ఎక్స్‌పర్ట్‌ కె.సత్యనారాయణ, స్టేట్‌ డ్యాం సేఫ్టీ చీఫ్‌ ఇంజినీర్‌ ప్రమీల సందర్శించారు. ప్రాజెక్ట్‌ వరద గేట్లు, కౌంటర్‌ వెయిట్‌లు, లిఫ్టింగ్‌ రోప్‌లను పరిశీలించారు. వరద గేట్ల ఆపరేటింగ్‌ సమస్యలు, ప్రాజెక్ట్‌ స్థితిగతులను ఎస్‌ఈ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచన లు, సలహాలు చేశారు. ఇందులో ఈఈ విఠల్‌ రాథోడ్‌, డీఈ నవీన్‌, విజయలక్ష్మి, గణేశ్‌, ఇరిగేషన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

సీల్డ్‌ ఏజెన్సీ బృందం సందర్శన

నిలిపివేయబడిన కాల్వ కడెం ప్రాజెక్ట్‌ పూడికతీత టెం డర్ల ప్రక్రియను ఈనెల 27న, పూర్తి చేసి, పనులను ఏజెన్సీకి అప్పగించారు. శుక్రవారం ఏజెన్సీ సిబ్బం ది కడెం ప్రాజెక్టును సందర్శించి ఇరిగేషన్‌ అధికారు లతో మాట్లాడారు. ఏజెన్సీ పేరు, వివరాలు కరీంన గర్‌ సీఈ పరిధిలో ఉంటాయని, టెండర్‌ గురించి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎస్‌ఈ రవీం దర్‌ తెలిపారు.

సరిహద్దు ప్రాంతంలో విస్తృత తనిఖీలు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్‌ జాగిలంతో ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు చేప ట్టారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా తెలం గాణలోకి వచ్చిపోయే వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతు న్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ ముమ్మరం చేయడంతో పాటు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి సేవించిన, రవాణ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో చెన్నూర్‌ రూరల్‌ సీఐ సుధాకర్‌, ఎస్సై రాజేందర్‌, ఎక్సైజ్‌ అధికారులు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.



జాగిలంతో తనిఖీలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

నీలుగాయిని హతమార్చిన వేటగాళ్ల అరెస్టు

- నిందితుల్లో ఒకరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



అధికారుల అదుపులో వేటగాళ్లు

పెంబి/కడెం: మండలంలోని లోడుపల్లి అటవీ ప్రాంతంలో నీలుగాయిని హతమార్చిన వేటగాళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పెంబి/కడెం రేంజ్‌ అధికారి అనిల్‌ కుమార్‌ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లోడుపల్లి అటవీ ప్రాంతంలోని సహజ నీటి వన రుల వద్ద నీలుగాయిని హతమార్చారనే పక్కా సమా చారంతో రావడంతో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించాం. కొండపల్లి గ్రామానికి చెందిన చిప్పిడి వెంకటేశ్‌, ఎల్లాగ్‌ గ్రామానికి చెందిన దుర్గం రవీందర్‌ల ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. నీలుగాయి మాంసం లభ్యమైంది. వారిని విచారిం చగా కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం రవి, గొర్లపల్లి మొండి, మన్నెపల్లి శ్రీహరి, ఆత్రం భీమ య్యలతో కలిసి నీలుగాయిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. వెంకటేశ్‌, దుర్గం రవీందర్‌ను కోర్టు లో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌ విధించి నట్లు పేర్కొన్నారు. దుర్గం రవీందర్‌ పెంబిలపేట్‌ మండలంలోని మెరిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తు న్నాడు. పరారీలో ఉన్న మిగతా నలుగురిని పట్టు కుంటామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్‌ఎస్‌వో శంకర్‌, ఎఫ్‌బీవోలు సంగదీప్‌, సతీష్‌, లచ్చన్న, మనోహర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి హత్యకు సుపారీ

ఇచ్చోడ: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన భూ తగాదాల్లో రాజేందర్‌ అనే వ్యక్తిని చంపేందుకు సుపారీ తీసుకున్న షేక్‌ సోహెల్‌ శుక్రవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్‌ మండలంలోని గిర్నూర్‌ గ్రామా నికి చెందిన గొల్లెన రాజేందర్‌, మేకల దేవేందర్‌ మధ్యలో గత కొద్ది రోజులుగా భూమి వివాదం నడుస్తోంది. అయితే మేకల దేవేందర్‌ ఈనెల 16న ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన షేక్‌ సోహె ల్‌ను కలిసి గొల్లెన రాజేందర్‌ను హత్య చేసేందుకు రూ. 3 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే ఈనెల 26న షేక్‌ సోహెల్‌ రాజేందర్‌ను ఇచ్చోడ మండల కేంద్రంలో కలిసి నిన్ను హత్య చేసేందుకు దేవేందర్‌ సుపారీ ఇచ్చాడని, నువ్వు డబ్బులు ఇస్తే హత్య చేయకుండా వదిలేస్తానని బెదిరించాడు. భయాందోళన చెందిన రాజేందర్‌ సోహెల్‌కు ఫోన్‌ పే ద్వారా రూ. 2 వేలు చెల్లించాడు. మరింత డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌ లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు షేక్‌ సోహెల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లిన మాంసం.. కాలం చెల్లిన స్వీట్లు

- బల్దియా అధికారుల తనిఖీల్లో గుర్తింపు



స్వీట్లను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ బల్దియా పారిశుద్ధ్య విభా గం అధికారులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, స్వీట్‌ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. కలెక్ట రేట్‌ చౌక్‌లోని ఓ హోటల్‌ను తనిఖీ చేసిన అధికారులు కుళ్లిన 6 కిలోల మాంసం, గడ్డ కట్టిన ఫ్రైడ్‌ రైస్‌ చేవలు ను గుర్తించారు. వాటిని నిల్వ ఉంచిన ఫ్రిజ్‌లో పురు గులు ఉండటంతో హోటల్‌ యజమానిపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. కుళ్లిన మాంసంతో పాటు ఆహా ర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. హోటల్‌ నిర్వాహకుడిని హెచ్చరించి, జరిమానా విధిం చారు. అనంతరం వినాయక్‌ చౌక్‌లోని వెంకటేశ్వర స్వీట్‌షాపు, స్వీట్ల తయారీ ప్రాంతం పరిశుభ్రం గా ఉండటాన్ని గుర్తించారు. కాలం చెల్లిన స్వీట్లను తయారు చేసిన స్వీట్లతో కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించి, జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని ఫుడ్‌ ఇన్‌స్పె క్టర్లు ఎం.నరేందర్‌, బైరి శంకర్‌లు హెచ్చరించారు.

మందుబాబుల వీరంగం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి బార్‌లో గురువారం రాత్రి రెండువర్గాలు దాడి చేసు కున్న ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. సీసీసీ నస్పూర్‌ మండలం తాళ్లపల్లి గ్రామా నికి చెందిన డెబ్బెటి శ్రీనివాస్‌ తన స్నేహితులు మ ల్లేష్‌, అశోక్‌లు కలిసి ఏలైట్‌ బార్‌లో మద్యం తాగు తున్నారు. అక్కడే మరో ముగ్గురు బాడిసె రమేష్‌, ఉయికె మహేష్‌, ప్రశాంత్‌లు తాగుతున్నారు. రమే ష్‌, శ్రీనివాస్‌ స్నేహితులు కావడంతో వారు మాట్లా డుతుండగా.. మహేష్‌ అనే వ్యక్తి వచ్చి రమేష్‌ను నిల్చోబెట్టి మాట్లాడుతావా అంటూ.. శ్రీనివాస్‌తో గొడవకు దిగాడు. శ్రీనివాస్‌ తన తమ్ముడు శ్రీకాంత్‌ కు ఫోన్‌ చేయడంతో అతను వచ్చి మహేష్‌ను మం దలించాడు. దీంతో శ్రీకాంత్‌పై మహేష్‌, ప్రశాంత్‌ బీ రు బాటిల్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయప డ్డాడు. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా డెబ్బెటి శ్రీనివాస్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక అక్రమ రవాణపై కొరడా



సీజ్‌ చేసిన ట్రాక్టర్లు

జన్నారం: ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వారిపై అటవీశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. టైగర్‌జోన్‌ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌ చేశారు. ఇందన్‌పల్లి రేంజ్‌ అధికారి కారం శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రేంజ్‌ పరిధిలోని బుట్టాపూర్‌ వాగులో నుంచి ఇసుక తోడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. బుట్టాపూర్‌కు చెందిన తిప్పని విశ్వాస్‌, జన్నారంకు చెందిన దాసరి అన్వే ష్‌, కలమడుగుకు చెందిన పిండి ముజ్జన్నలకు చెం దిన ట్రాక్టర్లను సీజ్‌ చేసి రేంజ్‌ కార్యాలయానికి తర లించినట్లు తెలిపారు. అదే విధంగా మొర్రిగూడ ప్రాంతంలో తనిఖీ చేయగా మరో ట్రాక్టర్‌ అనుకోకో వ్వడంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక తవ్వడం, తరలించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

నస్పూర్‌: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్‌ ఏరియా జీఎం కార్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సింగరేణి కార్మికులు గాయప డ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌కే న్యూ టెక్‌ గనిలో విధులు నిర్వహిస్తున్న సీసీసీలో నివాసం ఉండే గట్టురాజు, బెల్లంపల్లిలో నివాసం ఉండే బీకటి జనార్దన్‌ శుక్రవారం విధులు ముగించు కుని బైక్‌పై శ్రీరాంపూర్‌ వైపు వెళ్తుండగా.. శ్రీరా మపూర్‌ జీఎం కార్యాలయం సమీపంలో వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో కార్మికులు ఇద్దరు గాయప డ్డారు. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆసు పత్రికి తరలించారు.

ఆన్‌లైన్‌ ప్రవేశాలు జరిగేనా..?

- ఇంటర్‌ విద్యలో అమలుపై స్పష్టత కరువు
- మాన్యువల్‌గానే ప్రవేశాలు
- విద్యార్థులపై ప్రైవేట్‌ యాజమాన్యాల ఒత్తిడి



బోథ్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల

బోథ్‌: డిగ్రీలో అమలు చేస్తున్న దోస్త్‌ విధానం తర హాలోనే ఇంటర్‌ ప్రవేశాలపై ప్రతిష్టంభన నెలకొంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం వచ్చినా.. మాన్యువల్‌ గానే ప్రవేశాలు పొందుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు తమ కళాశాలల్లో చేరాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తు న్నారు. ఫలితంగా విద్యార్థుల్లో అయోమయం నెల కొంది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రైవేట్‌, ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థుల ప్రవేశా లపై స్పష్టత కరువైంది.

ప్రైవేట్‌ కళాశాలల ఆగడాలకు చెక్‌..

ఇంటర్‌ ప్రవేశాల్లో దోస్త్‌ తరహా ఆన్‌లైన్‌ విధానం అమలైతే విద్యార్థులకు మేలు జరుగుతుంది. విద్యా ర్థి తనకు నచ్చిన కళాశాలను ప్రాధాన్యత క్రమం లో ఎంపిక చేసుకునే వీలుంటుంది. పదో తరగతిలో విద్యార్థికి వచ్చిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారం గా సీటు కేటాయింపులు జరుగుతాయి. ఈ విధానంతో విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలో చదివే వీలు ఉం టుంది. వివిధ ఫీజులతో కూడిన ప్రవేశాలు ఉంటే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉంటుంది. ఇంటర్‌ లో కూడా డిగ్రీ మాదిరిగానే ఆన్‌లైన్‌ ప్రవేశాలు చేప డితే ప్రైవేట్‌ కళాశాలల ఆగడాలను చెక్‌ పడనుంది.

విద్యార్థుల వద్దకు పీఆర్‌వోలు..

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌ లో ప్రవేశాలు పొందేందుకు ప్రాధాన్యం ఇస్తుం టారు. ఈక్రమంలో ప్రైవేట్‌ యాజమాన్యం క్షేత్రస్థా యిలో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఇప్పటికే

కళాశాలల వివరాలు (ప్రభుత్వ, ప్రైవేట్‌)	
ఆదిలాబాద్‌	76
నిర్మల్‌	63
మంచిర్యాల	62
కుమురం భీం ఆసిఫాబాద్‌	48

ఎండను సైతం లెక్క చేయకుండా ప్రతీ గ్రామాన్ని సందర్శిస్తున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాలల్లో చేరాలని కోరుతున్నారు. విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. కాగా ఆయా కార్పొరేట్‌ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థులతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మొదట చేరి.. తరువాత తిరిగి వచ్చి.. పదో తరగతి పరీక్షలను విద్యార్థులు రాయకముందే పలు ప్రైవేట్‌ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థుల ఇళ్లవద్దకు వెళ్తున్నారు. తల్లిదం డ్రులను కలిసి తమ కళాశాల గురించి వివరించి అడ్మిషన్లు చేస్తున్నారు. అడ్మిషన్ల సమయంలోనే వేలల్లోనే ఫీజులు కట్టించుకుంటున్నారు. ఇక పదో తరగతి పాస్‌ కాగానే విద్యార్థి కనీసం నెల రోజులు కూడా కళాశాలలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. తాము కట్టిన ఫీజు వాపసు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రులను ఇబ్బం దులు పెడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు నష్టపోతు న్నారు. డిగ్రీ మాదిరిగా ఇంటర్‌లో ఆన్‌లైన్‌ ప్రవేశా లు చేపడితే ఇలాంటి నష్టాలు జరిగే అవకాశం ఉం డదు. చెల్లించే ఫీజు వివరాలు కూడా ఆన్‌లైన్‌ ఆప్ష న్‌లో కనిపిస్తాయి. దీంతో ఎక్కువ ఫీజులు కట్టే అవకాశం కూడా ఉండదు.

ఆన్‌లైన్‌ ద్వారా చేపట్టాలి



ఇంటర్‌ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలి. డిగ్రీ మాదిరిగా ప్రవేశాలు నిర్వహిస్తే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. కార్పొ రేట్‌ కళాశాలలకు చెందిన పీఆర్‌ఓలు గ్రామాల్లోకి వచ్చి అడ్మి షన్లు తీసుకుంటున్నారు. దీంతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు అడ్వాన్స్‌ల పేరుతో వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు జరిపితే విద్యార్థి మంచి కళాశాలలో చదివే అవకాశం ఉంటుంది.

– బోయిడి ఆకాష్‌, ఏబీవీపీ నాయకుడు

ఎలాంటి నోటిఫికేషన్‌ రాలేదు

గతంలో ఇంటర్‌లో ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం విద్యార్థి కళాశాలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. విద్యార్థి కళాశాలల్లో అడ్మిషన్‌ తీసు కోవాలంటే కళాశాల లాగిన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉం టుంది. లేదా విద్యార్థి తాను స్వయంగా ఆన్‌లైన్‌ ద్వారా వివరాలను నమోదు చేసుకుని కళాశాలలో చేరే అవకాశం ఉంది. కానీ డిగ్రీ తరహా దోస్త్‌ మాదిరి ఆన్‌లైన్‌ ప్రవేశాలు ఇంటర్‌లో లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్‌, సమాచారం లేదు.

– గణేశ్‌, జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి, ఆదిలాబాద్‌

రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం

- డీఎస్పీ జీవన్‌రెడ్డి
- వ్యక్తిపై దాడి చేసి కిడ్నాప్‌
- 9 మందిపై కేసు.. ఆరుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ సబ్‌ డివిజనల్‌ పరిధిలో రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివే స్తామని ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌. జీవన్‌రెడ్డి అన్నారు. రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడారు. జనవరి 8న ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బంగారుగూడకు చెందిన సయ్యద్‌ జాహెర్‌పై పలువురు దాడి చేసి, కిడ్నాప్‌ చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా చెబితే చంపే స్తామని బెదిరించడంతో భయపడి ఎవరికీ చెప్పలేదు. ఈనెల 26న ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారణ చేపట్టగా షేక్‌ ఇజాజ్‌, షేక్‌ సలీంతో పాటు మరో ఏడుగురు ఇంటిలో బంధించి కొట్టి, సోషల్‌ మీడియాలో పోస్ట్‌ పెట్టారు. ఈ వీడియో ఆధారం గా వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడి చేసిన బంగారుగూడకు చెందిన షేక్‌ ఇజాజ్‌, షేక్‌ రోషన్‌, షేక్‌ ముజీబ్‌, ఖానాపూర్‌కు చెందిన హసీబుల్లా, సయ్యద్‌ జుబేర్‌, మహాలక్ష్మివాడకు చెం దిన అమర్‌, షేక్‌ సోహెల్‌లను అరెస్ట్‌ చేయగా.. రాహుల్‌, షేక్‌ సలీంలు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్నవారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశం లో సీఐ ఫణిధర్‌, ఎస్సై ముజాహిద్‌, సిబ్బంది పాల్గొన్నారు.